సాక్షి
వికారాబాద్

మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



'పది' విద్యార్థులపై శ్రద్ధ

పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 8లో ▸



కళాశాలను తరలించొద్దు

ప్రభుత్వ మెడికల్ కళాశాలను కొడంగల్‌లోనే నిర్మించాలని కేడీపీ జేఏసీ నాయకులు సంతకాలు సేకరించారు. 8లో ▸



నాలుగేళ్లుగా మూత

దుద్యాల్ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన జలశుద్ధి కేంద్రాలు నాలుగేళ్లుగా మూతబడ్డాయి. 9లో ▸

న్యూస్‌రీల్

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

తాండూరు: రైతులకు ఇబ్బంది లేకుండా వరి, పత్తి కొనుగోలు చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. సోమవారం వికారాబాద్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి ఈ మేరకు విన్నవించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక అనుమతులు జారీ చేసేలా తహసీల్దార్లను ఆదేశించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూంలు, సబ్ స్టేషన్ నిర్మాణ పనులను వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బైపాస్ రోడ్డుకు మోక్షం

తాండూరు: తాండూరు బైపాస్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. నిర్వాసితులకు నాన్ అగ్రికల్చర్ భూమి గజానికి రూ.6 వేలు, వ్యవసాయ భూమి ఎకరాకు రూ.21 లక్షలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్ రూ.25.13 కోట్లు కేటాయించారు. దీంతో బైపాస్ రోడ్డు పనులకు అడ్డంకులు తొలిగినట్లయింది.

బీసీ రిజర్వేషన్ల సాధనకు కలిసి నడుద్దాం

తాండూరు టౌన్: రిజర్వేషన్ల సాధనకు కలిసి నడుద్దామని బీసీ సంఘాల నాయకులు కందుకూరి రాజ్‌కుమార్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం ఇచ్చిన బంద్‌ను విజయవంతం చేయడంలో భాగంగా ఈ నెల 15న తాండూరులో అఖిలపక్ష పార్టీలతో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు అఖిలపక్ష పార్టీల బీసీ సంఘాలు, బీసీ మేధావులు, అన్ని కుల సంఘాలు,ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. హైకోర్టు స్టే నేపథ్యంలో ఈ నెల 18న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన విషయం విధితమే. ఇట్టి బంద్‌ను విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

రైతుల సంక్షేమానికి కృషి


ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



విత్తనాలు పంపిణీ చేస్తున్న టీఆర్‌ఆర్

పరిగి: రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరిగి, దోమ, పూడూరు మండలాలకు చెందిన రైతులకు ఉచితంగా వేరుశనగ,శనగ విత్తనాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నదాతల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో రైతులను విస్మరించిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏడీఏ డీఎస్ లక్ష్మీకుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాట్‌పుట్‌లో సాయికిరణ్‌కు స్వర్ణం



గోల్డ్ మెడల్‌తో సాయికిరణ్

దుద్యాల్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన అల్వాల్ సాయికిరణ్ జాతీయ స్థాయి క్రీడల్లో బంగారు పతకం సాధించారు. భువనేశ్వర్‌లో నిర్వహిస్తున్న అండర్- 20 జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సోమవారం ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న ఈపోటీల్లో తెలంగాణ తరఫున షాట్‌పుట్‌లో పాల్గొన్న సాయికిరణ్ నంబర్‌వన్‌గా నిలిచారు.

నేడు సెర్ప్ అధికారుల సమావేశం

తాండూరు రూరల్: తాండూరు డివిజన్‌కు సంబంధించి సెర్ప్ అధికారుల సమావేశానికి మంగళవారం డీఆర్‌డీఏ శ్రీనివాస్ రానున్నట్లు మండల ఐకేపీ, ఏపీఎం బాలయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10:30 నిమిషాలకు మహిళా సమాఖ్యపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి తాండూరు, బషీరాబాద్, పెద్దేముల్, యాలాల, దౌల్తాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట్ మండలాల ఐకేపీ ఏపీఎం, సీసీలు తదితరులు హాజరుకావాలని కోరారు.

అప్పుల ఊబిలో జీపీలు

చెల్లించాల్సిన బిల్లులు రూ.29 కోట్లు

- రెండున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న మాజీ సర్పంచులు
- కార్యదర్శులపై నిర్వహణ భారం
- చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్న ప్రత్యేక అధికారులు
- పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- ఇబ్బందుల్లో ప్రజలు



పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతున్న మాజీ సర్పంచులు(ఫైల్)

వికారాబాద్: స్థానిక సంస్థలకు ఎన్నికలు ఆలస్యం కావడంతో గ్రామ పంచాయతీలు పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. పదవిలో ఉన్నప్పుడు చేసిన పనులకు బిల్లులు అందక మాజీ సర్పంచులు అవస్థలు పడుతున్నారు. రెండున్నరేళ్లుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగక వెలవెలబోతున్నాయి. ప్రస్తుతం జీపీల నిర్వహణ కార్యదర్శులపై పడింది. వీరు సైతం అప్పులు చేసి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల స్థానిక సందడి మొదలవడంతో బిల్లులు మంజూరవుతాయని అందరూ ఆశించారు. కానీ వాయిదా పడటంతో నిరాశకు లోనయ్యారు. జిల్లాలో 594 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో రూ.29 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందా అని గత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.750 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండగా రెండు నెలల క్రితం రూ.150 కోట్లు విడుదల చేసింది. అయితే జిల్లాకు చిల్లిగవ్వ కూడా రాకపోవడం నిరాశ పరిచింది.

బీఆర్‌ఎస్ హయాం నుంచే..

గత ప్రభుత్వ హయాంలో అప్పటి సర్పంచులు సొంత డబ్బు వెచ్చించి అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. కానీ బిల్లులు మంజూరు కాలేదు. అప్పట్లో ఏడాదిన్న పాటు ఎదురు చూశారు. ఆ తర్వాత వారి పదవీ కాలం ముగిసింది. మరో ఏడాదైనా బిల్లులకు మోక్షం లభించలేదు. సర్పంచుల స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించినా వారు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా సరిగ్గా లేదని ప్రజలు పేర్కొన్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో కనీస అవసరాల కోసం ప్రతి నెలా రూ.లక్షల్లో వెచ్చించాల్సి ఉంటుంది. చిన్న జీపీల్లో సైతం వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. సర్పంచులు పదవిలో ఉన్న సమయంలో సొంత డబ్బు లేదా అప్పు చేసి ఖర్చు చేసేవారు. వారి పదవీ కాలం ముగిసిన నాటి నుంచి ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. మిత్తికి డబ్బు తెచ్చి సమస్యలు పరిష్కరించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలు సార్లు కార్యదర్శులు మాకు ఈ బాధ్యతలు వద్దంటూ ఎంపీడీఓలకు పంచాయతీల తాళాలు అప్పగించగా.. వారిని సముదాయించి బాధ్యతలు అప్పగిస్తున్నారు.

పన్నులు ఖర్చు చేయలేని స్థితిలో..

గతంలో పన్నుల రూపంలో వచ్చే డబ్బును పంచాయతీలు వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉండేది. 2018లో కొత్త చట్టం అమలులోకి వచ్చింది. వసూలు చేసిన పన్నులు ట్రెజరీలో జమ చేయాలనే నిబంధన విధించారు. తిరిగి ప్రభుత్వ అనుమతితో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ట్రెజరీ ఖాతాలను ఎక్కువ శాతం ఫ్రీజింగ్‌లో ఉంచుతోంది. దీంతో పంచాయతీలు ఆ డబ్బు ఖర్చు చేసుకునే వీలులేకుండా పోయింది. పాలక మండళ్లు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి జీపీలకు రావాల్సిన నిధులకు బ్రేక్ పడింది. దీంతో పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

పెండింగ్‌లో స్కూల్ బిల్లులు

నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమం ప్రారంభించింది. జిల్లాలో మొత్తం 1,130 పాఠశాలలు ఉండగా 371 స్కూళ్లను ఈ పథకం కింద ఎంపిక చేశారు. వాటిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. 62 పాఠశాలల్లో పనులు పూర్తి కాగా రూ.24.4 కోట్లు చెల్లించారు. మరో రూ.10.35 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులు సైతం అప్పట్లో సర్పంచులు, వార్డు సభ్యులు చేశారు. పనులు పూర్తయ్యి మూడేళ్లు దాటినా బిల్లులు రాలేదని వారు తెలిపారు.



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

ప్రజావాణి అర్జీలను పరిష్కరించండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచరాదని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 56 దరఖాస్తులు వచ్చాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాధాన్యతను బట్టి ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ర్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్‌ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసుచంద్ర, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దు

- సజావుగా ధాన్యం సేకరించాలి
- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: వరి ధాన్యం సేకరణలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వరాదని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు.. నిర్వహణపై సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అవసరం మేరకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కొనుగోలకు అవసరమైన అన్ని యంత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలోని రావులపల్లి, కోత్లాపూర్ చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ధన్యాం జిల్లాలోకి ప్రవేశించకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, సివిల్ సప్లయ్ అధికారి సుదర్శన్, డీసీఓ నాగార్జున, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూరత్‌సింగ్ ఠాకూర్

సముచిత స్థానం కల్పిస్తాం

- డీసీసీ అధ్యక్ష పదవి కోసం అభిప్రాయ సేకరణ
- 16 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏఐసీసీ జిల్లా పరిశీలకుడు సూరత్‌సింగ్ ఠాకూర్

అనంతగిరి: పార్టీ కోసం పాటుపడిన వారికి పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తామని ఏఐసీసీ జిల్లా పరిశీలకుడు సూరత్‌సింగ్ ఠాకూర్ అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి గార్డెన్‌లో డీసీసీ అధ్యక్ష పదవి కోసం అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సంఘటన్ సృజన్ అభియాన్ పేరిట కార్యకర్తలతో కలిసి వారి అభిప్రాయాల మేరకు డీసీసీ అధ్యక్షుల పేర్లను సేకరించి ఏఐసీసీ నాయకత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. అధ్యక్ష పదవికి పోటీచేసే వారు ఈ నెల 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తాను ఈనెల 19వ తేదీ వరకు జిల్లాలో పర్యటిస్తానని తెలిపారు. ప్రతి మండలంలో పర్యటించి అక్కడి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. సమావేశంలో పీసీసీ పరిశీలకులు బెల్లయ్య నాయక్, నీలిమ, వేణుగౌడ్, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ధారాసింగ్, రఘువీరారెడ్డి, మాజీ చైర్మన్ సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చామల రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కష్టాలు

- భోజనం తయారీకి నిరాకరించిన ఏజెన్సీ మహిళ
- దగ్గరుండి వంట తయారు చేయించిన ఎంఈఓ, పాఠశాల సిబ్బంది
- డీఈఓ ఆదేశాలతో సమస్య పరిష్కారం
- తీరిన విద్యార్థుల ఆకలి



భోజనం తయారు చేయిస్తున్న ఎంఈఓ, సీహెచ్‌ఎం

బొంరాస్‌పేట: మధ్యాహ్న భోజనం తయారీకి ఏజెన్సీ మహిళ నిరాకరించింది. ప్రభుత్వం ఇచ్చే డబ్బు సరిపోదంటూ విధులకు డుమ్మా కొట్టింది. దీంతో విద్యార్థులు పస్తులుండే పరిస్థితి ఏర్పడింది. ఎంఈఓ, పాఠశాల సీహెచ్‌ఎం దగ్గరుండి వంట తయారు చేయించి విద్యార్థుల ఆకలి తీర్చారు. ఈ ఘటన బొంరాస్‌పేట మండలం ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని పాఠశాలలో 120 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఏజెన్సీ మహిళ చిట్టెమ్మ మధ్యాహ్న భోజనం తయారు చేసేది. సోమవారం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు డుమ్మా కొట్టింది. దీంతో స్కూల్ సిబ్బంది ఆమె ఇంటికి వెళ్లి వంట చేసేందుకు రావాలని కోరింది. కూలి గిట్టుబాటు కాదని తాను రానని చిట్టెమ్మ చెప్పింది. విషయం డీఈఓ రేణుకాదేవి దృష్టికి వెళ్లడంతో ఆమె ఎంఈఓ హరిలాల్‌కు ఫోన్ చేసి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. దీంతో ఎంఈఓ హరిలాల్, క్లస్టర్ హెచ్‌ఎం రవీందర్‌గౌడ్ స్కూల్‌ని సందర్శించారు. ఏజెన్సీ మహిళను పిలిపించాలని సిబ్బందికి సూచించారు. ఆమె రానని చెప్పడంతో హెల్పర్ బువ్వమ్మతో వంట చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో పాఠశాల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ఎంఈఓ హరిలాల్ మాట్లాడుతూ.. ఈ నెల 19న గ్రామ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటి వరకు హెల్పర్ బువ్వమ్మతో వంట చేయిస్తామని, సమావేశంలో వంట మనిషి నియామకంపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. అలాగే ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఏజెన్సీ మహిళ స్థానంలో మరో వంట మనిషిని నియమిస్తామని పాఠశాల కమిటీ చైర్మన్ బసమ్మ, గ్రామ సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మహేశ్‌కుమార్, జ్యోతి పరమేశ్వరి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దౌల్తాబాద్: జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు దౌల్తాబాద్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ శ్రీలత తెలిపారు. ఇటీవల స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -14 విభాగం కబడ్డీ పోటీల్లో అర్జున్, ఇందు సత్తాచాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని హెచ్‌ఎం శ్రీహరిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

కనుల పండువగా రథోత్సవం



స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పూడూరు: మండలంలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో కొలువుదీరిన తిరుమల నాథస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున రథోత్సవం వైభవంగా సాగింది. అనంతరం స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. భజన మండలి ఆధ్వర్యంలో సంకీర్తనలు ఆలపించారు. చిన్నారుల పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు పెంటయ్య, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, మాజీ సర్పంచ్ శ్రీధర్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుపా, సుభాష్, వెంకటేశంగుప్తా, కృష్ణ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

షాబాద్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో కాంగ్రెస్ అగ్రనాయకులు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం రెండోరోజు రిలే దీక్షలకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా బీసీలకు అన్యాయం చేస్తూ అణగదొక్కుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు న్యాయమైన వాటా అని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలన్నారు. 42 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు జడల రాజేందర్‌గౌడ్, రాపోల్ నర్సింహులు, తమ్మలి రవీందర్, మాణెయ్య, రమేష్, దర్శన్, శేఖర్, కృష్ణ, రఘువరన్, నారాయణ, దీక్షలో రాము, వెంకటేశ్‌గౌడ్, రాములు, మల్లయ్య, మల్లేష్ తదితరులు ఉన్నారు.

తైక్వాండోలో రచిత్‌కు పతకాలు

పరిగి: పరిగి పట్టణానికి చెందిన విద్యార్థి మేదర రచిత్ తైక్వాండో చాంపియన్ షిప్– 2025 రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు పతకాలు సాధించారు. హైదరాబాద్‌లో సోమాఫిట్ ఇంటర్నేషన్ వారు నిర్వహించిన పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు పొందాడు. దీంతో విద్యార్థి రచిత్‌ను స్థానికులు అభినందించారు.



పతకాలతో రచిత్

క్లుప్తంగా

నిరుపేదలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కుల్కచర్ల: నిరుపేద ప్రజలకు అండగా ఉంటామని పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఘణపూర్ గ్రామానికి చెందిన గజ్జి వెంకటయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. కాగా విషయం తెలుసుకున్న ఆయన సోమవారం స్థానిక నాయకులతో కలిసి వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. వెంకటయ్య పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఖర్చులు భరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు రాములు, చెన్నయ్య, బాలయ్య, మాసయ్య, బాలచందర్, కేశవులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి యత్నించిన వారిని శిక్షించాలి

ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

అనంతగిరి: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం వికారాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. ధర్నా చేపట్టి కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రశాంత్, మల్లికార్జున్, సుభాన్, అంజి, భరత్‌కుమార్, పుష్పరాణి, మంజుల, పద్మమ్మ, సునీత పాల్గొన్నారు.

అయోధ్యలో ప్రదర్శనకు మన కళాకారులు



ప్రకాశ్ మాస్టర్

బొంరాస్‌పేట: శ్రీరాముని జన్మస్థలం అయోధ్యలో జరిగే 'దీపోత్సవం 2025' ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొనే జానపద కళాబృందంలో జిల్లా కళాకారులకు స్థానం దక్కింది. 28 రాష్ట్రాల నుంచి పాల్గొనే ఈ కళ ప్రదర్శనలకు కొడంగల్‌కు చెందిన ప్రకాశ్ మాస్టర్ బృందానికి అవకాశం దక్కినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకు జరిగే ఉత్సవాల్లో 15 మంది కళా బృందం సభ్యులు తెలంగాణ బోనాల ప్రదర్శన చేయనున్నట్లు చెప్పారు. కళాబృందంలో కళాకారుల సంఘం నాయకులు కృష్ణయ్య, అంజిలప్ప, రమేష్, పెంటప్ప, చిన్ని మనీషా తదితరులున్నారని మాస్టర్ ప్రకటించారు.

వేటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



శేఖర్ (ఫైల్)

యాలాల: వేటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గురుదొట్ల శేఖర్ బాణాపూర్ గ్రామానికి చెందిన సునీల్‌తో కలిసి ఈ నెల 9వ తేదీ రాత్రి అటవీ ప్రాంతంలో వేటకు వెళ్లారు. నాటి నుంచి శేఖర్ తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన భార్య కవిత సోమవారం యాలాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

హత్య కేసులో నిందితురాలి అరెస్టు

14 రోజుల రిమాండ్ తరలింపు



నిందితురాలు మాధవి

కేశంపేట: భర్తను హత్య చేసిన ఘటనలో నిందితురాలైన భార్యను కేశంపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నరహరి కథనం ప్రకారం.. మండలం కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కొప్పు కుమార్(35) రోజూ మద్యం తాగి భార్య మాధవిని వేధిస్తుండేవాడు. ఈ నెల 11న రాత్రి సైతం మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. భర్తను ఎలాగైనా అంతం చేయాలని భావించిన మాధవి అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో అతని తల, ఛాతిపై సిమెంట్ ఇటుకతో బలంగా మోదింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఆమె మృతదేహాన్ని బయటికి ఈడ్చుకుంటూ వచ్చి ఇంటి ముందు ఉన్న నీటి సంపులో పడేసినట్లు తెలిపారు. ఇంట్లో ఉన్న రక్తం మరకలను తుడిచి, పౌడర్‌ను చల్లి ఆధారాలు దొరకకుండా చేసి పరారైనట్లు పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కేశంపేట వైఎస్ఆర్ చౌరస్తా వద్ద మాధవిని సోమవారం అదుపులోకి తీసుకొని విచారించగా.. ఆమె నేరాన్ని అంగీకరించారు. ఈ మేరకు ఆమెను కోర్టులో హాజరు పర్చారు. న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

'పది' విద్యార్థులపై శ్రద్ధ

- ప్రత్యేక తరగతుల నిర్వహణ
- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- సందేహాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయులు



బాలంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

దౌల్తాబాద్: రానున్న పదోతరగతి వార్షిక ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు దౌల్తాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. వారం రోజుల క్రితమే జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ప్రభుత్వ బడులకు ఉత్తర్వులు జారీ చేశారు.

రోజూ గంట పాటు

మండలంలో మొత్తం 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 450 మంది విద్యార్థులు పదో తరగతి విద్యనభ్యసిస్తున్నారు. ప్రత్యేక తరగతులతో పాటు అభ్యాస దీపికల తయారీ, తల్లిదండ్రులతో టెలీ కాన్ఫరెన్స్, విద్యార్థుల నిరంతర పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టారు. రోజూ సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15గంటల వరకు అదనంగా గంట పాటు రోజుకో సబ్జెక్టు చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. వచ్చే జనవరి 10 నాటికి సిలబస్ పూర్తి చేయాలని నిర్ణయించారు. అదే విధంగా ప్రతి వారం ఒక్కో పాఠ్యాంశంపై పరీక్ష నిర్వహించి విద్యార్థుల ప్రతిభను అంచనా వేసి వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నారు.

వారానికోసారి సమీక్ష

ప్రతి పాఠశాలలో వారానికి ఒకసారి ప్రత్యేక తరగతులపై సమీక్ష నిర్వహించనున్నారు. ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, పాఠశాల హెచ్‌ఎంలు తరగతుల నిర్వహణను పరిశీలిస్తారు. విద్యార్థుల మార్కుల అభ్యసన సామర్థ్యాలు ఎలా ఉన్నాయనే అంశాలను చర్చిస్తారు. పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోనున్నారు. చదువుకుంటే కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించి, వారిని మానసికంగా సన్నద్ధం చేస్తున్నారు.

శతశాతం కోసం..

మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేస్తాం.

– వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయి!

- డీసీసీ అభిప్రాయ సేకరణ సమావేశానికి కాలె యాదయ్య
- అభ్యర్థులను కలిసి వెళ్లిపోయిన వైనం



అభ్యర్థులు రాబర్ట్ బ్రూస్, అద్దంకి దయాకర్, నర్సింహారెడ్డిని కలిసి వెళ్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: డీసీసీ అధ్యక్ష ఎన్నికపై సోమవారం చేవెళ్లలో నిర్వహించిన అభిప్రాయ సేకరణ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భీం భరత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అధిష్టానం పంపించిన పార్టీ అభ్యర్థులు హాజరయ్యారు. మీటింగ్ మధ్యలో అక్కడికి చేరుకున్న లోకల్ ఎమ్మెల్యే యాదయ్య వచ్చిన అతిథులకు నమస్కరించి, కరచాలనం చేసి వెళ్లిపోయారు. పార్టీ ఫిరాయింపుల కేసు నేపథ్యంలోనే ఆయన మీటింగ్‌లో కూర్చోలేదని అక్కడున్న నేతలు గుసగుసలాడారు. ఇదిలా ఉండగా.. తాను పార్టీ మారలేదని చెప్పుకొంటున్న ఎమ్మెల్యే కాంగ్రెస్ మీటింగ్‌కు ఎందుకు వచ్చారో ఆయనకే తెలియాలని భీంభరత్ వర్గం అసహనం వ్యక్తం చేయగా, తన వర్గానికి నేనున్నానని సంకేతాన్నిచ్చేందుకే యాదయ్య ఇలా వచ్చి అలా వెళ్లిపోయారని కాంగ్రెస్‌లో చర్చ సాగింది.

బంద్‌ను విజయవంతం చేద్దాం



బీసీ సంఘాల ఐక్య కార్యచరణ సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి యాదవ్

అనంతగిరి: బీసీ రిజర్వేషన్ల సాధనకు ఈ నెల 18న తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి యాదవ్ అన్నారు. సోమవారం వికారాబాద్ క్లబ్ ఫంక్షన్‌హాల్‌లో ఆయా పార్టీల బీసీ ముఖ్యనాయకులు, ఆయా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి యాదవ్ మాట్లాడుతూ.. బీసీలంతా సంఘటితమై ఏకతాటిపైకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిసె లక్ష్మణ్, విద్యా మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాములు, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, లక్ష్మణ్, శేఖర్, రమేశ్, అంజయ్య, సురేందర్‌బాబు, అశోక్, విజయ్‌కుమార్, ఉమాశంకర్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సమష్టి బాధ్యత

- అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి



యాచారం: మొక్క నాటుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి

యాచారం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలని అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి సూచించారు. సోమవారం మండల పరిధిలోని గునుగల్, యాచారం గ్రామాల్లోని జీపీ ల్యాండ్స్, వెంచర్లలోని పది శాతం భూముల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లో ఏర్పాటయ్యే వెంచర్లలో పంచాయతీలకు రిజిస్ట్రేషన్లు చేసిన పది శాతం భూముల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. గ్రామాల్లోని కాలనీలు, రోడ్ల వెంట, పార్కు స్థలాల్లో మొక్కలు నాటాలని చెప్పారు. మొక్కలు నాటడమే కాదు.. సంరక్షణ చేయాల్సిన బాధ్యత మనదేనని అన్నారు. ఈజీఎస్ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం చేపడుతున్నామని, అర్హులైన ఆసక్తి కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధారాణి, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

మంచాల: గ్రామాల్లో మొక్కల పెంపకం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి సుభాషిణి అన్నారు. సోమవారం మండలంలోని ఆగాపల్లి, కాగజ్‌ఘట్ గ్రామాల్లో ఎన్ఆర్ ఈజీఎస్ పథకం కింద నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటడమేగాకుండా వాటిని సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వీరాంజనేయులు, ఈసీ విమల, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ బెటాలియన్ ఆత్మీయ కలయిక

ఏపీఎస్‌పీ 8వ బెటాలియన్ పోలీసులు 30 ఏళ్ల తరువాత ఆత్మీయంగా కలుసుకున్నారు. కొండాపూర్ 1995 బ్యాచ్‌కు చెందిన పోలీసులు మొయినాబాద్‌లోని ఓ ఫాంహౌస్‌లో కలుసుకుని 30 ఏళ్ల వేడుకలు నిర్వహించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆత్మీయ పలకరింపులతో రోజంతా ఉత్సాహంగా గడిపారు – మొయినాబాద్

ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

యాలాల: కాగ్నా నది నుంచి రాత్రివేళ ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌తో పాటు ఆటోను యాలాల పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని విశ్వనాథ్‌పూర్ శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో నదిలో ఇసుక లోడ్‌తో వెళుతున్న ఓ ట్రాక్టర్‌ను గుర్తించి పట్టుకున్నారు. మరోవైపు కోకట్ కాగ్నా నది నుంచి ఆటోలో సిమెంటు సంచుల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు, ఆటో ఢీ.. భార్యాభర్తలకు గాయాలు

ఆమనగల్లు: ఆటోను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామశివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భార్యాభర్తలు అశోక్‌రెడ్డి, సుమతమ్మ సోమవారం సమీపంలోని తమ వ్యవసాయ పొలంలో పచ్చిగడ్డి కోసుకుని ఆటోలో గ్రామా నికి వస్తుండగా ఆమనగల్లు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఆ టో కొద్ది దూరం వెళ్లి పల్టీ కొట్టడంతో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గుర్తించిన గ్రామస్తులు వెంటనే ఇరువురిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యా ప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి



కిషన్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని రాందాస్‌పల్లికి చెందిన కంతి కిషన్ (50) సోమవారం ఉదయం మృతిచెందాడు. ఇబ్రహీంపట్నం డిపోలో విధులు నిర్వర్తిస్తున్న కిషన్‌కు రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ చనిపోయాడు. బీఆర్ఎస్ నాయకు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, కొప్పు జంగయ్య తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కళాశాలను తరలించొద్దు

- కేడీపీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ



సంతకాలు సేకరిస్తున్న కేడీపీ జేఏసీ సభ్యులు

కొడంగల్: ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలను కొడంగల్‌లోనే నిర్మించాలని సోమవారం సాయంత్రం పట్టణంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కొడంగల్ అభివృద్ధి పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ(కేడీపీ జేఏసీ) ఆధ్వర్యంలో సంతకాలను సేకరించారు. కుల, మత వర్గ భేదం లేకుండా అందరి సహకారం కోరారు. కొడంగల్‌కు మంజూరు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలను, గురుకులాలను కొడంగల్ శివారులోనే నిర్మించాలని పట్టణవాసులు అన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామ శివారులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు గతంలో జిల్లా ఉన్నతాధికారులు భూమి పూజ చేశారని గుర్తు చేశారు. మండల పరిధిలోని ఎరన్‌పల్లి గ్రామ శివారులో మెడికల్ కళాశాల నిర్మాణానికి అక్కడి రైతుల నుంచి భూమి సేకరించారని అన్నారు. ఇంత చేసిన తర్వాత ఈ భవనాలను లగచర్లకు తరలిస్తున్నారని ప్రచారం జరగడం మంచిది కాదన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేడీపీ జేఏసీ కన్వీనర్ కొత్రికె లక్ష్మీనారాయణ గుప్తా, కో కన్వీనర్లు సురేష్‌కుమార్, శ్రీనివాస్, శాంతకుమార్, పవన్‌కుమార్, వెంకటయ్య, ప్రవీణ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

కొత్తూరు: పాత మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో ప్రభుత్వ పాఠశాల గేటుకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని స్థానికులు సోమవారం కమిషనర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యాలయానికి వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉందన్నారు. దానికి తోడు చిరు వ్యాపారులు ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇదే అదునుగా కొందరు రోడ్డుకు ఇరువైపులా డబ్బాలు, అక్రమ కట్టడాలు నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. మున్సిపాలిటీ అధికారులు అక్రమంగా వెలసిన కట్టడాలను తొలగించిన తర్వాత రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు. లేని పక్షంలో ధర్నాలు, ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి, కుమార్, నర్సింహ, సురేందర్, రాజు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు

- ముగ్గురికి తీవ్ర గాయాలు



ఘటనాస్థలిలో క్షతగాత్రులు

కొత్తూరు: ముందు వెళ్తున్న బైక్‌ను గుర్తు తెలియని బస్సు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలోని పెంజర్ల కూడలి జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన నవీన్(40), మల్లేష్(45) అన్నదమ్ములు. వీరు కొన్నేళ్ల నుంచి రాజేంద్రనగర్ సమీపంలోని కాటేదన్‌లో ఉంటున్నారు. ఆదివారం తమ స్వగ్రామంలో ఓ శుభకార్యం ఉండడంతో ఇద్దరితో పాటు మల్లేష్ కుమారుడు లోకేష్(12) బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురు బైక్‌పై బయలుదేరగా పట్టణంలోని పెంజర్ల కూడలి వద్దకు రాగానే వెనకాల నుంచి వచ్చిన గుర్తు తెలియని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఉస్మానియాకు తరలించారు.

మద్యం మత్తులో డ్రైవర్ హల్‌చల్

- రెండు బైకులు, దుకాణం, సామగ్రి ధ్వంసం



గౌతపూర్‌లో దుకాణం ముందుకు వెళ్లిన ట్రాక్టర్

తాండూరు రూరల్: మద్యం మత్తులో ఓ డ్రైవర్ ట్రాక్టర్ నడపడంతో బీభత్సం సృష్టించాడు. రెండు బైక్‌లు, సామగ్రి, కార్పెంటర్ షాపు షెటర్‌ను ధ్వంసం చేశాడు. ఈ సంఘటన మండల పరిధిలోని గౌతపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. మల్కాపూర్ శివారులోని నాపరాతి గనుల నుంచి డ్రైవర్ పవార్ లక్ష్మణ్ మద్యం తాగి ట్రాక్టర్‌లో నాపరాతి లోడ్‌తో తాండూరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో గౌతపూర్‌లో కొత్త అశోక్ దుకాణ సముదాయం వద్ద ఓ కార్పెంటర్ షాపులోకి దూసుకెళ్లాడు. అంతకు ముందు రెండు బైకులను ఢీకొట్టాడు. పక్కనే ఉన్న దుకాణం ముందు ఉన్న విలువైన సామగ్రిని ధ్వంసం చేశాడు. ట్రాక్టర్ ముందు టైర్ సైతం ఊడిపోయింది. వెంటనే స్థానికులు డ్రైవర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మద్యం మత్తు, అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడిపినందుకు డ్రైవర్ పవార్ లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎద్దులను ఢీకొట్టి వాహనం బోల్తా

ఇద్దరికి తీవ్ర గాయాలు

అనంతగిరి: రోడ్డు పక్కన వెళ్తున్న ఎద్దులను ఢీకొట్టడంతో వాహనం బోల్తా పడిన సంఘటన సోమవారం రాత్రి వికారాబాద్ మున్సిపల్ పరిధిలో ధన్నారం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని గోధుమగూడ సమీపంలోని ఓ రిసార్ట్‌లో పని చేస్తున్న అస్సాంకు చెందిన ఇద్దరు యువకులు పని నిమిత్తం చిన్న గూడ్స్ వాహనంలో హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా తిరుగు ప్రయాణంలో ధన్నారం వద్ద వాహనం వేగంగా నడపడటంతో అదుపుతప్పి రోడ్డు పక్కన వెళ్తున్న ఎద్దులను ఢీకొట్టారు. దీంతో ఒక్కసారిగా వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉంది. మరో వ్యక్తికి సైతం గాయాలయ్యాయి. ఎద్దుకు సైతం రెండు కాళ్లు విరగడంతోపాటు, కొమ్ములు సైతం విరిగిపోయాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

క్రాప్ సర్వేతో మేలు

వైపరీత్యాల సమయంలో త్వరగా పరిహారం

- పంటలు లాభాలకు అమ్ముకునే వెసులుబాటు
- నమోదు చేసుకోవాలని అధికారుల సూచన



క్షేత్రస్థాయిలో క్రాప్ సర్వే చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

కొత్తూరు: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను సమగ్రంగా తెలుసుకుని వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ప్రారంభమైంది. ఆ వివరాలను శాటిలైట్‌కు అనుసంధానం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మండలంలో సర్వే తుది అంకానికి చేరుకుంది. మండలంలో సాగుకు యోగ్యమైన భూమి 8,900 ఎకరాలు ఉండగా ఈ ఏడాది 8,800 ఎకరాల్లో రైతులు ఆయా రకాల పంటలను సాగు చేశారు. కాగా ఇప్పటికే వ్యవసాయ అధికారులు 8,200 ఎకరాల్లో సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిగిలిన 600 ఎకరాల్లో సాగు చేసిన వివరాలను త్వరలో పూర్తి చేయనున్నారు.

సర్వేతో ప్రయోజనాలు

- కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పలు పథకాలకు ఈ సర్వేను ప్రామాణికంగా తీసుకుని రైతులకు న్యాయం చేస్తారు.
- క్రాప్ సర్వేతో రైతులు ఎన్ని ఎకరాల్లో ఏఏ పంటలు సాగు చేశారో? అన్ని వివరాలు సమగ్రంగా అధికారుల వద్ద ఉంటాయి.
- పంట దిగుబడి సమయంలో రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా నేరుగా మార్కెట్‌లో తమ పంటలను విక్రయించుకునేందుకు వీలు కల్పిస్తున్నారు.
- సర్వేను ప్రామాణికంగా తీసుకుని భవిష్యత్తులో రైతులకు అవసరమైన ఎరువులు, ఇతర అవసరాలను తీర్చడానికి సర్వే అంశాలు చాలా వరకు ఉపయోగపడతాయి.
- ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకున్నప్పుడు రైతులకు త్వరగా పరిహారం అందించడంలో సర్వే వివరాలు దోహదపడతాయి.
- క్రాప్ సర్వే ఆధారంగా రైతులు నష్టపోయే పంటలను సాగు చేయకుండా చూడవచ్చు.
- అదే సమయంలో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను గుర్తించి వాటిని సాగు చేసే విధంగా వారిని ప్రోత్సహించవచ్చు.
- మండలంలోని క్లస్టర్ల వారీగా ఏఈవోలు తమకు కేటాయించిన గ్రామాల్లో మొబైల్ యాప్‌తో పంటలను సర్వే చేయాలి. అనంతరం సర్వే నంబర్ల వారీగా పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

నమోదు చేశాం



ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభమైన క్రాప్ సర్వే మండలంలో దాదాపు పూర్తయింది. 8,800 ఎకరాల్లో పంటలు సాగు చేయగా ఇప్పటివరకు 8,200 ఎకరాల్లో సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. క్రాప్ సర్వేతో రైతులకు బహుళ ప్రయోజనాలన్నాయి.

– గోపాల్‌నాయక్, ఏఓ, కొత్తూరు